ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రయాణంలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- నెల్లూరు జిల్లాలో విమానాశ్రయ నిర్మాణ పనులు త్వరలో చేపడతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ వెల్లడించారు.
- రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.
- పరీక్ష పే చర్చ వంటి కార్యక్రమాలు విద్యార్థులకెంతో ధైర్యాన్నిస్తాయని కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయురాలు శృతి పాండే తెలిపారు.

==================

స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రయాణంలో బ్యాంకులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఈ రోజు అమరావతిలో బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 10 సూత్రాల అమలుతో విజన్-2047 కలను నిజం చేసేందుకు నిత్యం శ్రమిస్తున్నామని అన్నారు. 15 శాతం వృద్ధిరేటుని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, వీటిలో కీలకమైన ప్రాథమిక రంగానికి బ్యాంకుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎక్కువ వృద్ధి సాధించే అవకాశం ఉందని, దీనికి బ్యాంకుల నుంచి తగిన మద్దతు కావాలని కోరారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని, దీనికి అనుగుణంగా పంటల సాగు కూడా మారుతోందన్నారు. భవిష్యత్తులో ఉద్యానవనరుల సాగు నేపథ్యంలో బ్యాంకులు హార్టికల్చర్ రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే ఆర్థికంగా బలోపేతానికి తోడ్పడే వాణిజ్య పంటల్ని సాగుచేసే రైతులకు బ్యాంకులు సహాయం అందిచాలన్నారు. సరైన మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధర కోసం బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు.

==================

నెల్లూరు జిల్లాలో విమానాశ్రయ నిర్మాణ పనులు త్వరలో చేపడతామని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ వెల్లడించారు. నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర మంత్రులు ఎన్.ఎం.డి. ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డిలతో కలిసి ఈరోజు ఆయన జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, విమానాశ్రయం అంశంపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో చర్చించామని, రాష్ట్రానికి ఒక కమిటీని పంపించనున్నట్లు మంత్రి చెప్పారని తెలిపారు. ఇప్పటికే విమానాశ్రయానికి అవసరమైన కొంత భూమిని సేకరించామని, మిగిలిన భూమిని సైతం సేకరించి, విమానాశ్రయ పనులను వేగవంతం చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

==================

జీవితం ఆనందంగా ఉండాలంటే ముందు ఆరోగ్యంగా ఉండాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి విద్యార్థులకు సూచించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల శరీరంలో అనేక సమస్యలు ఉత్పన్నమౌతాయని, చేతులు, గోర్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా పాటించాలని కలెక్టర్ పేర్కొంటూ..

(వాయిస్.. 36సెకన్లు)

అలాగే.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ, పిల్లల్లో నులిపురుగుల నివారణకు ప్రభుత్వం అందిస్తున్న అల్బెండజోల్ మాత్రలను అర్హులందరూ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు.

===================

రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు పనిచేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. గరివిడి మండలం దేవాడ గ్రామం వద్దనున్న తోటపల్లి కాలువను, దాని ప్రక్కనే ఉన్న మాంగనీస్, ఐరెన్ ఓర్ గనులను ఈ రోజు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేవాడ నుంచి దిగువ ప్రాంతాల్లో సుమారు 28 వేలమంది ఆయుకట్టు రైతులు ఉన్నారని, వారందరికీ సాగునీటిని సక్రమంగా అందించాలని స్పష్టం చేశారు. నీటి లీకేజ్ జరగకుండా, గనుల్లోకి నీరు వెళ్లకుండా సుమారు 100 మీటర్ల వరకు కాలువలో కాంక్రీట్ ఫ్లోరింగ్, ప్రక్క గోడలను నిర్మించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి, ఖరీఫ్ కు నీరు అందించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

===================

కోనసీమ జిల్లాలోని శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి జిల్లాస్థాయి అధికారులతో కలిసి తాసిల్దారులు, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, వివిధ మండల స్థాయి అధికారులతో ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రబీ సీజన్లో జిల్లాలో శివారు భూములకు సాగునీటి సమస్యలను నివారించాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు.

===================

విరామం

===================

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈరోజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. నైవేద్య విరామ సమయంలో శ్రీవారి ఆలయానికి వచ్చిన ఆయనకు టిటిడి అధికారులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించగా, పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

===================

"పరీక్షా పే చర్చ" కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని బలిజిపేట మండలం పెదపెంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల

కలలను సాకారం దిశగా విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని అన్నారు. అదే విధంగా గుంటూరు జిల్లా

కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయురాలు శృతి పొండే మాట్లాడుతూ, పరీక్ష పే చర్చ వంటి  కార్యక్రమాలు విద్యార్థులకెంతో ధైర్యాన్నిస్తాయని అన్నారు.

(వాయిస్.. 32సెకన్లు)

==================

గుంటూరు జిల్లాలోని మంగళగిరి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ప్రతిష్టాత్మక సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ -2025 ఈరోజు ప్రారంభమైనది. ఇండియన్ ఆడిట్స్ అకౌంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 4 రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న జట్లు మంగళగిరి స్టేడియంకు చేరుకున్నాయి.

==================

పార్వతీపురం మన్యం జిల్లా లో పరిశుభ్రతని పాటించి కలిసికట్టుగా బోదకాల వ్యాధిని నిర్మూలిద్దామని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా బలిజపేట మండలం పెదపెంకి గ్రామంలో నిర్వహించిన బోదకాలు వ్యాధి నివారణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు ఏ ఒక్కరికి బోదకాలు వ్యాధి సోకకుండా నివారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. మండలంలోని 57 వేల మందికి బోదకాలు వ్యాధి మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. రెండు సంవత్సరాల వయస్సు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను వేసుకోవాలని సూచించారు. బోదకాలు వ్యాధి పెరగకుండా శుభ్ర పరిచే విధానం, వ్యాయామం పై వైద్య సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించారు.

==================

జేఈఈ మెయిన్ పేపర్ 1కు సంబంధించిన ఫైనల్ కీ నుంచి అన్ని సెషన్లకు కలిపి మొత్తంగా 12 ప్రశ్నలు డ్రాప్ అయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆయా ప్రశ్నలకు గాను విద్యార్థులకు ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కుల చొప్పున కలిపే అవకాశం ఉంది. అయితే, డ్రాప్ అయిన వాటిలో అత్యధిక ప్రశ్నలు భౌతిక శాస్త్రం  నుంచే ఉండటం గమనార్హం. జేఈఈ మెయిన్ ఫలితాలను ఫిబ్రవరి 12 నాటికి విడుదల చేసే అవకాశం ఉందని తొలుత ప్రకటించినప్పటికీ.. తుది కీని ఈరోజే విడుదల చేయడంతో అతి త్వరలోనే పర్సంటైల్ స్కోరును వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకురానుంది.

==================

విజయనగరం జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్విజ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు ఏ. సోమేశ్వరరావు ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సిఈఓగా వున్న రాంగోపాల్ స్థానంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు ఇన్ చార్జి సిఇఓ గా సోమేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు.

==================

దివ్యాంగులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీకాకుళం ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.భాస్కరరావు అన్నారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల పిల్లలను గుర్తించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి విభిన్న ప్రతిభా వంతులను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పారా లీగల్ వాలంటీర్స్, అంగన్వాడీలు, ఏ ఎన్ ఎం లు ఇతర అధికారుల సమక్షంలో సర్వే ను నిర్వహిస్తామని తెలిపారు.

===================

ఆరోగ్య భారత్ సాధనలో భాగంగా వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా విధిగా నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు వేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈరోజు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కొత్తూరు మండలం మెట్టూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో కలిసి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 19 సంవత్సరాల వయసు లోపు విద్యార్థులందరూ ఒక అల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని, మాత్రల వలన ఏ విధమైన ఇబ్బందులు ఉండవని అన్నారు. నులిపురుగుల వలన రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలుంటాయని చెప్పారు.

===================
===================